


ఐలమ్మ పోరాటమే
**మాకు స్ఫూర్తి**
వర్ధంతి వేడుకల్లో వక్తలు 3లో

లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, వీర్లపల్లి శంకర్ తదితరులు




# హైదరాబాద్ వార్త




# పోకిరీల భరతం

**జులాయి బ్యాచ్ ఆట కట్టించిన షీటీం**
**మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన 1612 మంది అరెస్ట్**
**పట్టుబడిన వారిలో 1,544 మంది మేజర్లు.. 68 మంది మైనర్లు**

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** భాగ్యనగరంలో గణేష్ ఉత్సవాలు అంగరంగా వైభవంగా జరిగాయి. ఉత్సవాల నేపథ్యంలో ఖైరతాబాద్ వినాయకుడు, బాలాపూర్ గణేష్‌తో పాటు నగరవ్యాప్తంగా పేరొందిన ప్రముఖ మండపాలలో వెలసిన వినాయకులను దర్శించేందుకు మహిళ భక్తులు అధికంగా వస్తుంటారు. దీంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు చేపడతారు. ముఖ్యంగా మహిళ భక్తుల రక్షణకై ప్రత్యేక చర్యలు తీసుకుంటారు. ఈ క్రమంలో మహిళలతో అసభ్యంగా ప్రవర్తించే పోకిరీలపై స్పెషల్ నిఘా ఏర్పాటు చేశారు హైదరాబాద్ షీ టీమ్స్ పోలీసులు. ఆకతాయిల ఆట కట్టించేందుకు ప్రముఖ మండపాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు మఫ్టీలో డ్యూటీ చేస్తూ మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన 1612 మంది పోకిరీలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు నగర షీ టీమ్స్(మహిళ భద్రత విభాగం) డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పట్టుబడిన వారిలో 1,544 మంది మేజర్లు ఉండగా 68 మంది మైనర్లు ఉన్నట్లు చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉండేందుకు మైనర్లకు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. మొత్తం 1612 కేసుల్లో 168 పెట్టీ కేసులు నమోదు కాగా, వాటిలో 70 కేసులను ఇప్పటికే నాంపల్లి కోర్టు ముందు హాజరుపరిచారు. విచారణ చేపట్టిన కోర్టు 10 కేసుల్లో నిందితులకు రూ. 50 జరిమానా, 59 కేసుల్లో రూ. 1050, ఒక కేసులో 2 రోజుల సాధారణ జైలు శిక్ష విధించింది. మిగతా 3లో

# జూబ్లీ బరిలో మాగంటి సునీత?

**ఉప ఎన్నిక రేసులో పలువురు బిఆర్ఎస్ ప్రముఖులు**
**గోపీనాథ్ సతీమణి సునీత వైపే హైకమాండ్ మొగ్గు**
**తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సారథ్యంలో కీలక సమావేశం**
**పార్టీ నిర్ణయం తేలిపోవడంతో ఆశావహులు డుమ్మా**
**డివిజన్ ఇంచార్జ్‌లుగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు బాధ్యతలు**




బుధవారం తెలంగాణభవన్‌లో జరిగిన సమావేశంలో మాగంటి సునీతను పరియం చేస్తున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**హైదరాబాద్, సెప్టెంబరు 10,ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత బరిలోకి దిగనున్నారు. ఆమె పేరును బీఆర్ఎస్ పార్టీ దాదాపు ఖరారు చేసినట్టు తెలుస్తోంది. బుధవారం తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరనేది త్వరలోనే పార్టీ చీఫ్ కేసీఆర్ ప్రకటిస్తారని పార్టీ విజయానికి అంతా సమిష్టిగా కృషి చేయాలని కోరారు. అయితే ఈ సమావేశానికి టికెట్ ఆశిస్తున్న వారిలో కేవలం మాగంటి సునీత మాత్రమే రావడం, ఆమె అధ్యక్షతన మీటింగ్ జరగడంతో సునీతనే అభ్యర్థి అనే విజయాన్ని చర్చించుకుంటున్నారు. ఇక్కడి నుంచి మాజీ ఎమ్మెల్యే, దివంగత పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్, రావుల శ్రీధర్ రెడ్డి టికెట్ ఆశించినా సునీతనే అభ్యర్థిగా ఖరారు చేసినట్లు తెలుస్తుంది. ఉపఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గులాబీ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్సీ నేతృత్వంలో అత్యంత పకడ్బందీగా సర్వే నిర్వహించారని తెలుస్తోంది. ఇందులో ప్రధానంగా అభ్యర్థి ఎవరైతే బాగుంటుందనే ప్రశ్న ఉండగా.. పలు సర్వేలను క్రోడీకరించుకొని సునీతకే చాన్స్ ఇవ్వాలని పార్టీ అధినాయకత్వం నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది.
సునీతకు టికెట్ ఇస్తే సానుభూతి సెంటిమెంట్ కూడా కలిసి వస్తుందని పార్టీ భావిస్తోందని పార్టీకి చెందిన ఓకీలక నేత వెల్లడించారు. ఇటీవల జరిగిన ఓ మీటింగ్ లోనూ మాజీ మంత్రి తలసాని ఇదే విషయాన్ని వెల్లడించారు. సునీత బరిలోకి దిగబోతున్నారని, ఆమెను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.
జూబ్లీ హిల్స్ సెగ్మెంట్ పరిధిలో ఆరు డివిజన్లున్నాయి. ఈనేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ వాటికి ఇన్‌చార్జిలను నియమించింది. రహమత్ నగర్- తక్కెళ్ల పల్లి రవీందర్ రావు, యూసూఫ్ గూడాకు -పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, బోరబండ -వివేక్ గౌడ్ , షేక్ పేట- దాసోజు శ్రావణ్, వెంగళరావు నగర్- సుధీర రెడ్డిని, ఎర్రగడ్డకు మాధవరం కృష్ణారావును నియమించారు. అలాగే ఇప్పటికే కూతుళ్ల ప్రచారం మాగంటి సునీతను గెలిపించాలని కోరుతూ ఆమె కూతుళ్లు మాగంటి అక్షర, మాగంటి దిశి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.
రహమత్ నగర్ డివిజన్ లో ఇంటింటికీ వెళ్లి తమ తల్లికి ఓట్లు వేయాలని అభ్యర్థిస్తుండటం విశేషం. ఇదే క్రమంలో సోషల్ మీడియాలోనూ పోస్టులు పెడుతున్నారు.

## సరోగసీ పేరుతో రూ. కోట్ల దందా

**విచారణలో వెలుగుచూస్తున్న 'సృష్టి' రహస్యాలు**

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాత వార్త:** సంతానం లేని దంపతుల ఆశను క్యాష్ చేసుకున్న కిలాడీ లేడీ డాక్టర్ నమ్రత అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తునే ఉన్నాయి. సృష్టి ఫెర్టిలిటీ కేసులో ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రతను సీసీఎస్ పోలీసులు ఒకరోజు కస్టడీలోకి తీసుకొని విచారణ జరిపి.. ఏజెంట్ల నియామకం, శిశువుల కొనగోళ్లు, సహకరించిన వైద్యుల వివరాలు రాబట్టారు. ఆమె చెప్పిన వివరాల ఆధారంగా సరోగసీ ముసుగులో ఎన్నో అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణకు వచ్చారు. పదేళ్లుగా సరోగసీ ముసుగులో రూ. కోట్లు వసూలు చేసినట్లు తేల్చారు. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడలలోని ఫెర్టిలిటీ కేంద్రాలకు చికిత్సకు వచ్చే దంపతుల వివరాల నమోదుకు వేర్వేరు రికార్డులు నిర్వహించినట్లు కనుగొన్నారు. నగదు లావాదేవీలకు తమ వద్ద పనిచేసే సిబ్బంది బ్యాంకు ఖాతాలను వాడినట్లు తెలిపారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా అక్రమ లావాదేవీలను చేసినట్లు పోలీసులు అంచనాకు వచ్చారు. ఆమె కుమారుడు జయంత్ కృష్ణ కూడా కీలకంగా వ్యవహరించినట్లు గుర్తించారు. అయితే ఈ కేసులో ఇప్పటివరకు 27 మందిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. సికింద్రాబాద్‌లోని సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ మోసాలపై మొదట విచారణ చేపట్టిన రామ్‌గోపాల్‌పేట పోలీసులు కేసు తీవ్రత దృష్ట్యా నగర సీసీఎస్‌కు బదిలీ చేశారు. నమ్రతను మరోసారి కస్టడీకి తీసుకొని విచారించేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

## నగరంలో పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు**
**అధికారులకు జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ ఆదేశం**



పారిశుద్ధ్యపనులను పరిశీలిస్తున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్, అదనపు కమిషనర్ రఘుప్రసాద్ తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి పెట్టి...సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని జిహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం శేరిలింగంపల్లి జోన్ పరిధి యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ, బోరబండ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో చెత్త తొలగింపు, స్వీపింగ్, వ్యర్థాల నిర్వహణపై సానిటేషన్ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ బోర్కడే హేమంత్ సహదేవ్ రావులతో సమీక్షి ంచారు. స్థానికులతో కమిషనర్ మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ ప్రశ్నించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు జిహెచ్ఎంసీ సిబ్బందికి సహకారం అందించాలని కోరారు. క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ప్రభావంతంగా సాగేలా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జోనల్, సర్కిల్ అధికారులు పర్యవేక్షి ంచాలని కమిషనర్ ఆదేశించారు. సకాలంలో చెత్త సేకరణకు వెంటనే చేపడుతూ పరిశుభ్రత నెలకొనేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆర్ వి కర్ణన్ అధికారులకు సూచించారు.

## బ్యాంకు ఉద్యోగులకు బురిడీ

**రూ. 25 లక్షలతో ఉడాయించిన క్యాబ్ డ్రైవర్**

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాత వార్త:** బ్యాంకు ఉద్యోగులను బురిడీ కొట్టించి రూ. 25 లక్షలతో ఓ క్యాబ్ డ్రైవర్ ఉడాయించిన ఘటన బుధవారం బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిటీ యూనియన్ బ్యాంకుకు చెందిన ఉద్యోగులు సికింద్రాబాద్ బ్యాంక్ నుంచి బాలానగర్ బ్యాంకుకు డబ్బులు తరలించాల్సి ఉంది. ఈ క్రమంలో ఉద్యోగులు ఓలా యాప్‌లో కారు బుక్ చేసుకున్నారు. కారు వచ్చిన అనంతరం రూ. 25 లక్షల నగదు పెట్టెతో కారులో ఎక్కారు. పెట్టెలో డబ్బు ఉన్నట్లు గుర్తించిన కారు డ్రైవర్ వాటిని కాజేయాలని



పన్నాగం పన్నాడు. బాలానగర్ దగ్గర బ్యాంకు ఉద్యోగులు కారులో నుంచి దిగి పెట్టెను తీస్తున్నారు. అదే అదునుగా కారు డ్రైవర్ కారును ఫాస్ట్‌గా ముందుకు పోనిచ్చి డబ్బు పెట్టెతో సహా ఉడాయించాడు. ఈ ఘటనతో ఒక్కసారిగా బ్యాంకు ఉద్యోగులు షాక్‌కు గురయ్యారు. వెంటనే షాక్ నుంచి తెరుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# అవినీతి మేత

**ప్రజలను మోసం చేసే వ్యాపారులే వారి టార్గెట్**
**ఎంఆర్‌పి ట్యాంపరింగ్, లేబులింగ్, పరిమాణపు మోసాలపై అనధికార దాడులు**
**బేరసారాలతో గప్‌చుప్**
**ఏరియాల వారీ షాపుల పంపకాలు**
**అవినీతి కొలత శాఖ అధికారుల తీరిదీ..**



**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లుగా తూనికల కొలతల శాఖలో పనిచేస్తున్న కొందరు అవినీతి అధికారులు షాపులను పంచేసుకుంటున్నారు. ప్రైవేట్ సిబ్బందితో అక్రమ వసూళ్లు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారు. నగరంలో చాలా ప్రాంతాల్లో పెట్రోల్‌బంకులు, మాల్స్, గోల్డ్‌షాపులు, కిరాణాదుకాణాలు ఇలా అన్నింట్లోనూ లీగల్‌మెట్రాలజీ నిబంధనలు ఉల్లంఘిస్తూ ప్యాకింగ్ మోసాలకు పాల్పడుతున్నారు. ఎమ్మార్పీ ధరలను ట్యాంపరింగ్ చేయడం, ప్యాకింగ్ పరిమాణాలు తగ్గిపోవటం, ఎమ్మార్పీలేకుండానే అధిక ధరలకు విక్రయించడం వంటివి విచ్చలవిడిగా జరిగిపోతున్నాయి. ఈనేపథ్యంలో దీన్ని అరికట్టాల్సిన తూనికలు కొలతలశాఖలోని కొందరు అధికారులు వాటిని క్యాష్ చేసుకుంటున్నరు. మీరు నిబంధనలు పాటించడం లేదంటూ కేసులుపెట్టకుండా వారివద్దనుంటే నెలనెల మామూళ్లు వసూలు చేస్తున్నారు. ముఖ్యంగా బరువు తూచేయంత్రాల తయారీ, మరమ్మత్తు, యంత్రాలు సరిచూసి అధికారుల ఆమోదంతో ధ్రువీకరించేందుకు తూనికలు,కొలతల శాఖ అనుమతులు ఇస్తుంది. అవి పొందిన లైసెన్స్‌దారులు ఆయా వ్యాపారులు త్రాసులను ఏటా మరమ్మత్తు చేసి తనిఖీ అధికారి నుంచి వ్యాపారికి సర్టిఫికేట్ ఇవ్వాలి. ఈక్రమంలో తనిఖీ అధికారి యంత్రాన్ని పరిశీలించి అంతా సక్రమంగా ఉంటే సీలు వేస్తారు. ఈప్రక్రియ పూర్తయిన తర్వాత అధికారుల తనిఖీల సమయంలో బరువు తక్కువగా చూపి వినియోగదారులను మోసం చేస్తున్నట్లు గుర్తిస్తే వ్యాపారితోపాటు సదరు యంత్రం తనిఖీ చేసి లైసెన్స్‌దారుల, తయారీదారులపై చర్యలు తీసుకోవాలి. కానీ ఇందుకు విరుద్దంగా వ్యాపారులపై కేసులు నమోదు చేసి లైసెన్స్‌దారులను వదిలేస్తున్నారు. అలాగే ఎలక్ట్రానిక్ కాంటాలను అధికారులు తనిఖీ చేసిన తర్వాత సీలు వేసి ముద్ర వేయాల్సి ఉంది. అయితే క్షేత్రస్థాయిలో వ్యాపారులు ఉపయోగిస్తున్న యంత్రాలకు సీలులేకపోవడం గమనార్హం. కొందరు వ్యాపారులైతే నేరుగా తయారీదారుల వద్దకు వెళ్ళి బరువు ఎక్కువ చూపేలా యంత్రాల సాఫ్ట్‌వేర్ మార్పుచేయాలని కోరడం గమనార్హం. ఆహారపదర్థాల సంచులపై తయారీదారుడి పేరు, గడువు, బ్యాచ్‌నవంబర్ ,టోల్‌ఫ్రీనెంబర్ ,తయారీదారుని చిరునామా ,గరిష్ట చిల్లధర ముంద్రించాలని నిబందనలు చెబుతున్నా..ఆచరణలో అమలు కావడం లేదు.

**వసూళ్ల పర్వం ఇలా ..**

మరమ్మత్తులు, రెన్యూవల్ పేరుతో లైసెన్స్ దారులు జిల్లా స్థాయి అధికారులు అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి ఎలక్ట్రానిక్ కాంటాలను సంవత్సరానికి ఒకసారి రెన్యూవల్ చేసుకోవాలి. మ్యానువల్ కాంటాలను రెండు సంవత్సరాలకు ఒకసారి రెన్యూవల్ చేసుకోవాలి. రెన్యూవల్ ఫీజు ఒక గ్రాము నుంచి 20కేజీలవరకు పదిరూపాయలు మాత్రమే, 30కేజీల నుంచి 50కేజీల వరకు 40రూపాయాల ఫీజు ఉంటుంది. కానీ వీరు 2నుంచి 5వేలకవరకు వసూళ్లు చేస్తున్నారు. అలాగే పెట్రోల్ బంకు యజమానుల నుంచి జిల్లా స్థాయి అధికారులకు నెలనెల మామూళ్లు ముట్టుతున్నట్లు అరోపణలు ఉన్నాయి. పెట్రోల్ మిగతా 3లో

# హైడ్రా చొరవ.. సేఫ్

**రూ.100 కోట్ల విలువైన భూమి**
**ప్రభుత్వ భూమికి అధికారులు కంచె**
**కూకట్‌పల్లిలో 1.20 ఎకరాల స్థలం స్వాధీనం**



ప్రభుత్వ భూమి చుట్టు కంచె ఏర్పాటు చేసిన దృశ్యం

హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కూకట్పల్లి గ్రామం సర్వే నంబరు 276లో 1.20 ఎకరాల భూమిని బుధవారం హైడ్రా స్వాధీనం చేసుకుంది. దీని విలువ రూ. 100 కోట్లకు పైగా ఉంటుందని తెలిపింది. ఆల్విన్ కాలనీకి ఆనుకుని ఉన్న 276 సర్వే నంబరులో 2.39 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా.. ఇప్పటికే కొన్ని ఇళ్ల నిర్మాణం జరిగాయి. ఇంకా మిగిలి ఉన్న 1.20 ఎకరాల భూమి కబ్జా కాకుండా స్వాధీనం చేసుకున్న భూమి చుట్టూ కంచె వేసింది. అయితే ఈ భూమి తమదంటూ హైదరాబాద్ ఆల్విన్ ఎంప్లాయీస్ హౌసింగ్ కమిటీ పోరాడుతోంది. ఇదే సమయంలో ఆల్విన్ కాలనీ సంక్షేమ సంఘంతో పాటు ఆ పక్కనే ఉన్న కాకతీయనగర్ కాలనీ వాసులు మాత్రం ఈ భూమిని కాపాడి.. పార్కును నిర్మించాలనిలని డిమాండ్ చేస్తున్నారు. ఎవరి డిమాండ్లు ఎలా ఉన్నా.. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవ్వకుండా హైడ్రా ఫెన్సింగ్ వేయడంపట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.
హైదరాబాద్ ఆల్విన్ ఎంప్లాయీస్ హౌసింగ్ కమిటీకి 1986లో ప్రభుత్వం 79.29 ఎకరాల స్థలాన్ని ఇచ్చింది.
రెండు దశల్లో ప్లాట్ల కేటాయింపు జరిగింది. ఇంకా ఇల్లు రానివారు కొంతమంది ఉన్నారంటూ పక్కనే ఉన్న 2.39 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని హైదరాబాద్ ఆల్విన్ ఎంప్లాయీస్ హౌసింగ్ కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు డబ్బులు కూడా చెల్లించినట్టు కమిటీ ప్రతినిధులు చెబుతున్నారు. కమిటీ ప్రతినిధులు కొనకుండానే 2.39 ఎకరాల్లో ప్లాట్లు వేసి అక్రమంగా అమ్మారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆల్విన్ కంపెనీ బంద్ అయ్యింది. ఇంకా ఆ కమిటీ మనుగడలో లేదని.. ఆల్విన్ కాలనీలోని ప్లాట్లు కూడా ఇష్టానుసారం అమ్మేశారని ఆ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఇక్కడి ఖాళీ స్థలంలో అక్రమ పార్కింగ్ కొనసాగుతోందని.. దీంతో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని హైడ్రా ప్రజావాణికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదులను విచారించిన హైడ్రా.. సర్వేనంబరు 276లో ఉన్నది 2.39 ఎకరాలు ప్రభుత్వ స్థలమే అని నిర్ధారించింది. ఇప్పటికే కొన్ని ఇళ్లు రాగా.. మిగిలి ఉన్న 1.20 ఎకరాల స్థలాన్ని కాపాడి బుధవారం ఫెన్సింగ్ వేసింది.

**మోడీ విధానాలతో విదేశంగ విధానానికి**

## పెను ప్రమాదం

**-అమెరికాకు సాగిలపడే చర్యలు**
**-ట్రంప్ విధానాలను కూడా ప్రశ్నించలేని స్థితిలో ఫారిన్ పాలసీ**
**-అంబానీ మొప్పుకోసం పరితపిస్తున్న మోడీ**
**-సీతారాం ఏచూరి వర్థంతి సభలో ప్రొఫెసర్ నాగేశ్వర్**

**చిక్కడపల్లి, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** దేశంలో మోదీ విధానంతో విదేశాంగ విధానం ప్రమాదంలో పడిందని,భారత్ కు స్వతంత్ర విదేశాంగ విధానం లేకుండా పోయిందని అమెరికా అధ్యక్షుడు బెదిరింపులు చేస్తే బెంబేత్తిపోయి,పోగిడితే అమెరికాకు భయపడి అమెరికా ప్రయోజనాల కోసం పనిచేస్తుందని "అమెరికా ఆధిపత్యం




ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ కె.నాగేశ్వర్

కోనసాగించడానికి" అమెరికా కుట్రలు చేస్తోందని ప్రొ: కె.నాగేశ్వర్ అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రజనీకాంత్ అధ్యక్షతన మాజీ ఎం.పి. ఎస్ఎఫ్ఐ మాజీ జాతీయ అధ్యక్షుడు సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా " అమెరికా ఆధిపత్యం భారత దేశం ఎం చేయాలి" అనే అంశంపై స్మారకోపన్యాసం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ అమెరికా తన ఆధిపత్యం కోనసాగింపు కోసం దేశాలపై టారిఫ్స్ విధిస్తుందని, అమెరికా విధించే టారిఫ్స్ వల్లన మన దేశంలో రైతాంగం, ఆక్వా, పాల రైతులు ,లెదర్ తదితర రంగాలపై ప్రభావం ఉంటుందని ఈ చర్యలు నుండి ఉపశమనం కోసం ప్రభుత్వం రాయితీలు ప్రకటించి ఉపశమనం కల్గించాలని అన్నారు. అమెరికా వేసిన టారిఫ్స్ గురించి కనీసం ఒక్కమాట కూడా మోదీ మాట్లాడలేదని మన దేశంపై మోదీ విధానాలతో దాడిచేసిన కూడా మోదీ మోనంగా ఉన్నారని అన్నారు. చైనా పై టారిఫ్స్ వేస్తే చైనా దీటుగా టారిఫ్స్ పెంచి బదులు ఒచ్చిందని కానీ మన దేశం మిగతా 3లో



విజేతలను సత్కరిస్తున్న బాగ్‌లింగంపల్లి డాక్టర్ సరోజా వివేక్

## యోగా టోర్నీలో అంబేద్కర్ కళాశాలల ప్రతిభ

**చిక్కడపల్లి, సెప్టెంబరు 10 (ప్రభాతవార్త):** బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యార్థులు ఉస్మానియా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల యోగా ఛాంపియన్‌షిప్ పోటీలలో తృతీయ స్థానంలో నిలిచి సత్తా చాటారు. ఈ సందర్భంగా కళాశాలలలో నిర్వహించిన అభినందన సత్కార కార్యక్రమంలో కళాశాలల కరస్పాండెంట్ డాక్టర్ సరోజ వివేక్ విజేతలను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో అంబేద్కర్ విద్యాసంస్థల సీఈవో ప్రొఫెసర్ లింబాద్రి, జాయింట్ డైరెక్టర్ యాదగిరి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ మట్ట, ఫిజికల్ డైరెక్టర్లు శ్రావణ్, పాండు తదితరులు పాల్గొని విజేతలకు అభినందనలు తెలిపారు. మొత్తంగా 10 టీములు పాల్గొనగా కళాశాల నుంచి రాహుల్, శ్రావణ్, సురేష్, రియాజ్ పాల్గొని విజయాన్ని అందించగా బహుమతులను ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు రాజేష్, డిప్ల, సునీల్ కుమార్ పాల్గొని క్రీడాకారులకు పతకాలు, సర్టిఫికేట్లను ప్రదానం చేశారు.



ఫైల్‌నేమ్ ఆవిష్కరిస్తున్న జస్టిస్ బి.చంద్రకుమార్

## మానవీయ విలువల మిళితం హసిత బాష్పాలు

**చిక్కడపల్లి, సెప్టెంబరు 10 (ప్రభాతవార్త):** ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఆధ్యాత్మిక గురువు భగవాన్ శ్రీరాం సర్ రాసిన హసిత బాష్పాలు మానవీయ విలువలు బోధించిన మహా కావ్యమని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ పేర్కొన్నారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య బుధవారం విజ్ఞాన కేంద్రంలో భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్, విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ కవి కళారత్న డా.బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన హసిత బాష్పాలు సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంతర్జాతీయ వ్యక్తిత్వ వికాస నిపుణులు డా.వర్లు, వి.జి.ఎఫ్ అధ్యక్షులు డా.పి.విజయలక్ష్మి పండిట్, పలువురు కవులు డా.నాళేశ్వరం శంకర్, ప్రొ.మునిరత్నం నాయుడు, జె.కె.భారతి, అంతర్జాతీయ గజల్ గాయని జ్యోతిర్మయి మళ్ళా, మాలేపాటి ఆనందగుప్త, మోనశ్రీ మల్లిక్, మారేపల్లి భువనేశ్వరి, డా.రాధా కుసుమ, శ్రీపేరి, కోగంటి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా.రాధా కుసుమ నిర్వహించిన కవి సమ్మేళనం ఆహుతులను విశేషంగా అలరించింది.



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

## రహదారి పనులను వేగంగా పూర్తి చేయాలి

**చిక్కడపల్లి, సెప్టెంబరు 10 (ప్రభాతవార్త):** బాగ్‌లింగంపల్లి, చిక్కడపల్లి ప్రాంతాలలో రోడ్డు అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేస్తున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గురువారం చిక్కడపల్లి లోని సోప్‌ఫ్యాక్టరీ వీధిలో సాగుతున్న రోడ్డు పనులను బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహాతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకర్ ముదిరాజ్, మన్నె దామోదర్ రెడ్డి, మీడియా ఇంచార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, గోక నవీన్, ఆర్ వివేక్, కళ్యాణ్ నాయక్, టీవీ రాజు, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, గోపి, కృష్ణ, సాయి చాణిక్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అభివృద్ధి పనులను ఎటువంటి ఆటంకాలు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.



అవనీష్‌ను అభినందిస్తున్న దృశ్యం

## మార్షల్ ఆర్ట్స్‌లో అవనీష్ ప్రతిభ

**కంటోన్మెంట్, సెప్టెంబరు 10 (ప్రభాతవార్త):** బోయిన్‌పల్లి సెయింట్ పీటర్స్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న అవనీష్ బొలిశెట్టి అండర్ 17 విభాగంలో జరిగిన సిబిఎస్సీ నేషనల్ త్వైకాండో ఛాంపియన్‌షిప్ ఈ నెల 7న ఉత్తర ప్రదేశ్‌లో జరిగిన మార్షల్ ఆర్ట్స్‌లో మరో మెడల్స్ సాధించాడు. ఈ సందర్భంగా బోయిన్‌పల్లి సెయింట్ పీటర్స్ స్కూల్ యాజమాన్యం, కోచ్ నర్సింహ్మాను, అవనీష్ తల్లిదండ్రులు బిందు కిరణ్, మమతా జైన్‌లు ఘనంగా సత్కరించారు. తెలంగాణలో జరగనున్న సిఎం కప్ గోల్డ్ మెడల్ సాధించి మంచి పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని సూచించారు.

## సమస్యల పరిష్కారమే లక్ష్యం

**అల్వాల్, సెప్టెంబరు 10 (ప్రభాతవార్త):** ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నామని అల్వాల్ కార్పొరేటర్ శాంతి పేర్కొన్నారు. బుధవారం ఆనంద్‌రావు నగర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న యుజిడి పనులను ఆమె పర్యవేక్షించారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# డిమాండ్ల సాధన కోసం 12 నుంచి సమ్మె చేపడతాం

**గిరిజన,ఆశ్రమ పాఠశాలల డైలీ వేజ్ వర్కర్ల జెఏసి**

**ముషీరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై ఈనెల 12 నుంచి సమ్మె చేపడుతున్నామని తెలంగాణ గిరిజన మరియు ఆశ్రమ పాఠశాల డైలీ వేజ్ వర్కర్ల జేఏసీ నేతలు బి.మధు, ఎం.పా పారావు స్పష్టం చేశారు. బుధవారం కవాడిగూడలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తెలంగాణ గిరిజన హాస్టల్ మరియు ఆశ్రమ పాఠశాల డైలీ వర్కర్ల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నాయని ఆరోపించారు. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా 1935 పోస్టులు రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి, క్యాబినెట్ ఆమో దం పొందినప్పటికీ, అది నేటికీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రజా దర్బార్‌లో గిరిజన సంక్షేమ శాఖా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను జేఏసీ ఆధ్వర్యంలో కలిసి, వినతి పత్రం ఇవ్వడమైనది తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు పాత పద్ధతిలో చెల్లించాలని, చనిపోయిన వర్కర్ల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి అని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరా మన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిం చారని, ప్రిన్స్‌పల్ సెక్రటరీతో చర్చించి, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. 11వ తేదీలోగా మా డైలీ వేజ్ వర్కర్ల సమస్యలు పరిష్కారం కావాలని, లేనిపక్షం 12 నుంచి సమ్మె చేపట్టటం ఖాయమని వారు స్పష్టం చేశారు.



మంత్రి లక్షణ్ కుమార్‌కు వినతి పత్రం అందచేస్తున్న తెలంగాణ గిరిజన హాస్టల్ మరియు ఆశ్రమ పాఠశాల డైలీ వేజ్ వర్కర్ల జెఏసి నేతలు



బ్యాడ్మింటన్ విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

## సెయింట్‌అన్స్ విజయకేతనం

**నిజాంపేట్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** బాచుపల్లిలోని విఎన్ఆర్విజెవిటి కొడె వెంకటాద్రి చౌదరి క్రీడా సముదాయంలో రెండ్రోజులపాటు నిర్వహించిన ఉస్మానియా యూనివర్సిటీ అంతర కళాశాల మహిళా బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ విజయవంతంగా ముగి సింది. విజ్ఞాన జ్యోతి ఇన్సిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ ఆధ్వర్యం వహించిన ఈ టోర్నమెంట్‌లో 13 కాలేజీల నుంచి క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సెయింట్‌అన్స్ టీం భవన్ వివేకానంద టీంను ఓడించి విజేతగా నిలిచింది. విల్లామేరి, సెయింట్‌అన్స్ డిగ్రీ అండ్ పిజీ కాలేజ్ క్రీడాకారులు సెమీ ఫైనలిస్టులుగా నిలిచా యి. ఫిజికల్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీరామ, ప్రొఫె సర్లు దీపా. డా. ఎన్ అరుణ. డా. రమలు విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు.



ఆందోళన నిర్వహిస్తున్న సెంట్రల్ వర్సిటీ విద్యార్థులు

## యూనియన్ రద్దును వ్యతిరేకిస్తూ ధర్నా

**గచ్చిబౌలి, సెప్టెంబరు 10 ప్రభాతవార్త :** గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులు మరోసారి రోడ్డెక్కారు. స్టూడెంట్ యూనియన్‌ను రద్దు చేస్తున్నట్లు వర్సిటీ యాజమాన్యం ప్రకటన విడుదల చేయడంతో బుధవారం పలు విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. పదవీ కాలం పూర్తికాకముందే రద్దు చేయడం కుట్రపూరితమని ఆరోపించాయి. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ గతకొన్ని రోజుల క్రితం అన్ని విద్యార్థి సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో స్టూడెంట్ యూనియన్‌ను పూర్తి కాలం పదవిలో ఉంచాలని తీర్మానించచారని, కానీ ఒక్క ఏబివిపి మాత్రం ఎన్నికలకు వెళ్లాలని చెప్పిందన్నారు. మెజారిటీ విద్యార్థి సంఘాల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోకుండా యాజమాన్యం ఏకపక్షంగా స్టూడెంట్ యూనియన్‌ను రద్దు చేసిందన్నారు. వర్సిటీ వెల్లడించిన ఉత్తర్వులను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కరెంటు షాక్‌తో ఎలక్ట్రిషియన్ మృతి

**పేట్ బషీరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** కరెంటు షాక్‌తో ఎలక్ట్రిషియన్ మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా బొమ్మరాజుగూడెం మండలంలోని మెట్ల గ్రామానికి చెందిన వంపెల్లి కృష్ణ (30) తన భార్య పూజతో పాటు రెండేళ్ల కూతురుతో కలిసి కుత్బుల్లాపూర్ భగత్‌సింగ్ నగర్‌లో నివాసం ఉంటూ, దుండిగల్లోని రెడ్డి ల్యాబ్‌లో ఎలక్ట్రిషియన్‌గా పని చేస్తున్నాడు. కాగా అప్పుడప్పుడు వీక్‌ఆఫ్ ఉన్న సమయంలో బయట ఎలక్ట్రిషియన్‌గా వెళ్తుంటాడు. దీనిలో భాగంగానే బుధవారం కొంపల్లిలోని ఓ బహుళ అంతస్తులు నిర్మాణంలో ఎలక్ట్రిషియన్‌గా పని చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా కరెంటు షాక్ తగలడంతో వెనకాల పడ్డాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పుస్తెలతాడు చోరీ

**పేట్ బషీరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** పేట్ బషీరాబాద్ పీఎస్ పరిధిలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన సంఘటన బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పీఎస్ పరిధిలోని కెవిరెడ్డి నగర్‌లో బాలమణి అనే మహిళ వాకింగ్ వెళ్లి వస్తుండగా వెనకాల నుండి ఇద్దరు అగంతుకులు ద్విచక్రవాహనంపై వచ్చి మెడలో ఉన్న (పుస్తెలతాడు) మూడున్నర తులాల విలువ గల బంగారు గొలుసును లాక్కొని వెళ్లారు. అనంతరం ఎన్సీఎల్ కాలనీ వద్ద ఓ యువతి మెడలో చైన్‌ను లాగేందుకు ప్రయత్నించగా... ఫలితం లేకపోవడంతో అక్కడి నుండి పరారయ్యారు.



శ్రీశైలంను కలిసి సత్కరిస్తున్న రమేష్ మంజల్కర్

## వడ్డెర సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి

**నిజాంపేట్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షులుగా ఎన్నికైన రమేష్ మంజల్కర్ బుధవారం షాపూర్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ని కలిశారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ వడ్డెర సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చెయ్యాలని కోరారు. సంఘానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందన్నారు.



బిజెపి ఎస్సీ మోర్చా నేత నాగరాజుతో సమావేశమైన అడ్డా కూలీలు

## అడ్డా కూలీలకు అండగా ఉంటా

**నిజాంపేట్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** నిజాంపేట కార్పొరేషన్‌లో అడ్డా కూలీలకు ఏ సమస్య వచ్చిన తాను అండగా ఉంటానని.. వాటి పరిస్కారం కోసం కృషి చేస్తానని బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసి నాగరాజు తెలిపారు. నిజాంపేట అడ్డ కూలీలు పలు సమస్యలపై దాసి నాగరాజు దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి కార్మికులు సంఘటితమవ్వాలని కోరారు.



కమిషనర్‌తో మాట్లాడుతున్న బండి రమేష్

## అభివృద్ధి పనులపై సమీక్ష

**కెపిహెచ్బి కాలనీ, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** కూకట్పల్లి నియోజకవర్గంలో చేపట్టవలసిన వివిధ అభివృద్ధి పనులపై పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ బండి రమేష్ బుధవారం జోనల్ కమిషనర్‌తో సమావేశమై చర్చించారు. బతుకమ్మ, దసరా పండుగ నిర్వహణకు ఏర్పాటు చేయాలని సూచించారు.

## ఇడ్లీ సాంబార్‌లో బొద్దింక !

**కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** టిఫిన్ సెంటర్‌లలో శుచి శుభ్రత కరువవుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆహార పదార్థాలలో నాణ్యత లోపించటంపై ఫుడ్‌సేఫ్టీ అధికారులు దృష్టి పెట్టాలని కోరుతున్నారు. బుధవారం వివేకా నంద నగర్‌లో గల ఏరువాక టిఫిన్ సెంటర్‌లో సాంబర్ ఇడ్లీ ఆర్డర్ ఇవ్వగా అందులో బొద్దింక ప్రత్యక్షమైందని ఓ వినియోగదారుడు తెలిపారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలియజేశారు.



ఒప్పందాన్ని మార్పిడి చేసుకుంటున్న రామకృష్ణ, షిన్ మత్సుమురా తదితరులు

## ఐఎసిజి కళాశాల జపాన్ కియోటోసేకాతో ఒప్పందం

**నాంపల్లి, సెప్టెంబరు 10 ప్రభాతవార్త :** భారతదేశంలో తొలిసారిగా మల్టీమీడియాలో డిగ్రీ, పిజీ ప్రోగ్రామ్‌లను ప్రవేశపెట్టి ఐఎసిజి మల్టీమీడియా కళాశాల జపాన్‌లోని ప్రపంచంలోనే మొదటి, అగ్రగామి విశ్వవిద్యాలయమైన కియోటోసేకాతో పరస్పర అవగాహన (ఎంఒయు) కుదుర్చుకున్నట్లు ఐఎసిజి సంస్థ వ్యవస్థాపకుడు, ఎండి రామకృష్ణ తెలిపారు. ఈమేరకు హైదరాబాద్ టీహబ్‌లో బుధవారం సాయంత్రం ఈ అవగాహన ఒప్పందాన్ని రామకృష్ణ కియోటోసేకా షిన్ మత్సుమురా పరస్పరం మార్పిడి చేసుకున్నట్లు వివరించారు. హైదరాబాద్‌లో వేగంగా ఎదుగుతున్న ఐటి ఎకోసిస్టమ్, క్రియేటివ్ ఇండస్ట్రీలను దృష్టిలో పెట్టుకుని ఈ ఒప్పందం ద్వారా గ్లోబల్‌హబ్‌గా ఎదగడానికి సిద్ధంగా ఉందని, భారత క్రియేటివ్ విద్యార్థులకు విదేశీ ప్లేస్‌మెంట్ అవకాశాలు పెరుగుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో డా. విఎల్‌వి ఎస్ఎస్. సుబ్బారావు, వైస్‌చాన్సలర్ తకాషి సుజుకి, చీఫ్ డైరెక్టర్ జనరల్, జెట్రో, చీటీభీమ్ సృష్టికర్త రాజీవ్ చిలకా తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలో అభివృద్ధికి కృషి చేస్తా : ఎంపి ఈటెల రాజేందర్

**కంటోన్మెంట్,సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** కంటోన్మెంట్‌లోని వివిధ కాలనీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ తెలిపారు. బుధవారం 6వ వార్డులోని కార్తీక్ ఎన్‌క్లేవ్ కాలనీలో కాలనీ అసోసియేషన్ నిధులతో రూ.12 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పార్కును బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు పబ్బ శ్రీనివాస్, బిజెపి నాయకులు బానుక మల్లికార్జున్, బి.ఎన్.శ్రీనివాస్, బాణాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పార్కును ప్రారంభించిన ఎంపి ఈటెల రాజేందర్, బోర్డు మెంబర్ బానుక నర్మధ తదితరులు

## నైపుణ్య శిక్షణలో తెలంగాణాను ట్రెండ్ సెట్టర్ చేస్తాం

### మంత్రి వివేక్ వెంకటస్వామి

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన విషయంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని ట్రెండ్ సెటర్‌గా నిలుపుతామని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ పథకం కింద శిక్షణ పొందిన 18 మంది ఎలక్ట్రీ షియన్లకు బుధవారం సచివాలయంలో ప్రశంసాపత్రాలు అందించారు. వీరంతా జర్మనీలో ఉద్యోగం చేయనున్నారని, వీరికి నెలకు రూ. 2.6లక్షల వేతనం లభిస్తుందన్నారు. ఇండో యూరో సింక్రనైజేషన్(ఐఈఎస్) సంస్థ వీరికి ఆరు నెలల పాటు శిక్షణనిచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇతర దేశాల్లో పనిచేసేలా వృత్తి నైపుణ్య శిక్షణనిస్తుందన్నారు. ఈ పథకం ద్వారా ఇక్కడి వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందన్నారు. త్వరలోనే ఐఈఎస్ ఆధ్వర్యంలో సంస్థ కార్యాకలాపాలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తామని, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు నైపుణ్య శిక్షణ పెంచేందుకు పలు కార్యక్రమాలు, క్యాంపులు నిర్వహిస్తామని సంస్థ సీఈఓ డాక్టర్ బంగారు రాజు తెలిపారు.



ప్రశంసాపత్రాలు చూపుతున్న ఉద్యోగులతో మంత్రి వివేక్ వెంకటస్వామి తదితరులు

## నకిలీ లీజు ఒప్పందం సృష్టించిన నిర్మాతపై కేసు నమోదు

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్‌లో ఖరీదైన ఒక ఇంటిని నకిలీ పత్రాలతో ఆక్రమించేందుకు ప్రయత్నించిన ఒక సినీ నిర్మాతతోపాటు అతని భార్యపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. రోడ్ నంబరు 25లో చల్లా తిరుమల వెంకటేష్ (ఎన్ఆర్ఐ)కు దాదాపు 576 గజాల స్థలంలో డూప్లెక్స్ భవనం ఉంది. కుమారుడు తన తల్లి చల్ల లక్ష్మేశ్వరి(85) పేరుతో జీపీఏ చేసి ఇంటిని చూసుకొనే బాధ్యతలను అప్పగించాడు. 2013లో ఎస్‌బికె ఫిలిం కార్పొరేషన్ యజమాని, నిర్మాత షేక్ బషీర్ ఇంటిని లీజుకు తీసుకున్నాడు. మొదట 11 నెలల ఒప్పందం చేసుకొని తరువాత రెన్యువల్ చేసుకుంటూ వచ్చాడు. అనంతరం 2023లో అద్దె చెల్లించడం నిలిపివేశాడు. దీంతో యజమాని కోర్టును ఆశ్రయించారు. విచారణలో భాగంగా బషీర్ 2012 డీసెంబరు నుంచి 99 ఏళ్ల లీజుకు కుదుర్చుకున్నట్లు 2112 వరకు తనకు లీజు హక్కు ఉన్నట్లు పత్రాలు సృష్టించాడు. లక్ష్మేశ్వరి సంతకాన్ని ఫోర్జరీ చేసి ఈ పత్రాలను సృష్టించాడు. లక్ష్మేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు మోసం, నకిలీ పత్రాల సృష్టి, మోసపూరితంగా ఆస్తి దక్కించుకోవడానికి ప్రయత్నించడం కింద బషీర్‌తోపాటు అతని భార్య షేక్ కరీమున్నీసాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పాత సినీ గీతాలతో మానసికోత్సాహం

**ఇస్రో సైంటిస్ట్ డైరెక్టర్ డా. ప్రకాష్ చౌహాన్**

**నాంపల్లి, సెప్టెంబరు 10 ప్రభాతవార్త :** అలనాటి ఆణి ముత్యాల్లాంటి సినీ గీతాలు ఉల్లాసం, ఉత్సాహం, మానసిక వికాస చైతన్య గీతికలని ఇస్రో డైరెక్టర్ డా. ప్రకాష్ చౌహాన్ అన్నారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ కాకినాడ మ్యూజికల్ గ్రూప్ ఆధ్వర్యంలో సుర వరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాల యం లోని డా. నందమూరి తారక రామారావు కళా మందిరంలో బుధవారం నిర్వహించిన సినీ సంగీత విభావరికి ఆయన హాజరై గాయనీ గాయకులను అభినందించారు. గౌరవ అతిథులుగా డా. సిహెచ్.త్రినాథరావు, డా. జి.ఉమాదేవి, డా. వైవిఎన్.కృష్ణమూర్తి, బి.వినోద్‌బాబు, కె.వాసవదత్త రమణ, కుమార్, రవికుమారి తదితరులతో కలిసి ఇస్రో డైరెక్టర్ డా. ప్రకాష్‌చౌహాన్ దంపతులను ఘనంగా సత్కరించారు. సంస్థ వ్యవస్థాపకుడు జి.ఎస్.జె.కుమార్, కరస్పాండెంట్ టి.రవికుమారి, ప్రముఖ ఛాయాగ్రాహకుడు జొన్నలగడ్డ సుధీర్‌కుమార్, పిఎంకె.గాంధీ తదితరులు పాల్గొన్నారు. హిందీ, తెలుగు సినీగీతాల బాలీవుడ్ గోల్డెన్ మ్యూజికల్ హిట్స్‌తోసాగిన సంగీత విభావరి ఆద్యంతం ఆకట్టుకుంది.




ఇస్రో డైరెక్టర్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

## అక్రమంగా ఇండియాలో ప్రవేశించిన పాకిస్తానీ

### తిరిగి వెనక్కి డిపోర్ట్ చేసిన పోలీసులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** ఇండియాలోకి అక్రమంగా ప్రవేశించిన పాకిస్తాన్ దేశస్తుడు ముహమ్మద్ ఉస్మాన్ (అలియాస్) ఎం.డి.అబ్బాస్ ఇక్రమ్(48)ను హైదరాబాద్ నగర పోలీస్, కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, విదేశాంగ మంత్రిత్వ శాఖల సమన్వయంతో ఈ నెల 9వ తేదీన పంజాబ్‌లోని అటారి సరిహద్దు ద్వారా విజయవంతంగా తన దేశానికి డిపోర్ట్ చేసినట్లు సీపీ సి.వి.ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సంబంధిత వ్యక్తి 2011లో నేపాల్ ద్వారా అక్రమంగా భారత్‌లో ప్రవేశించిన అతడిపై హైదరాబాద్‌లో నాలుగు క్రిమినల్ కేసులు నమోదై, వాటిలో అతడు దోషిగా తేలడంతో 5 సంవత్సరాల వరకు జైలు శిక్షలు అనుభవించాడు. న్యాయ ప్రక్రియలు ముగిసిన తర్వాత, అతడిని 7న హైదరాబాద్‌లోని సిసిఎస్ నిర్బంధ కేంద్రంలో ఉచారు. అనంతరం నిబంధనల ప్రకారం 9న అతడిని పాకిస్తాన్ రేంజర్లకు అప్పగించారు. 2018 ఆగస్టు 29న ఏర్పాటైన సిసిఎస్ హైదరాబాద్‌లోని నిర్బంధ కేంద్రంలో ఇప్పటి వరకు 19 దేశాలకు చెందిన మొత్తం 158 మంది నిర్బంధితుల వీరిలో 150 మందిని ఇప్పటికే తమ దేశాలకు పంపించారు. ఇటీవల ఆగస్టు 8న అక్రమంగా ఇండియాలో నివసిస్తూ మానవ

## అవమానం భరించలేక వ్యక్తి ఆత్మహత్య

**జీడిమెట్ల, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :** ఓ మహిళ తనపై చేసిన దుష్ప్రచారం భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది పోలీసుల కథనం ప్రకారం గాజుల రామాలయం డివిజన్ పరిధిలోని కైసర్ నగర్ డబల్ బెడ్ రూమ్ ఆరవ బ్లాక్‌లో నివాసం ఉంటున్న రాజు (65) నివాసం ఉంటున్నాడు.

కొద్దిరోజుల క్రితం ఓ మహిళ ఆ కారణంగా తనపై లేనిపోని నిందలు వేయడంతో మనస్థాపానికి గురై బుధవారం తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సూరారం పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



అనురాగ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బిఆర్ఎస్ నేత స్కైలాబ్

## బిఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తా

**బేగంపేట సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** రాంగోపాల్‌పేట డివిజన్‌లో కాంగ్రెస్ నేత శీలం అనురాగ్ బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఆ పార్టీ సీనియర్ నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్ సమక్షంలో మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణాగౌడ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనురాగ్ మాట్లాడుతూ డివిజన్‌లో బీఆర్ఎస్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, అనురాగ్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో కేశవ్ అగర్వాల్, ప్రతీక్, అభిషేక్‌శెట్టి, ఆదేశ్ బిరాడ, ముస్తాఫా, ప్రేమ్‌యాగు, రతుల్ తదతరులు పాల్గొన్నారు.

## గొందళి సమాజ్‌ను బిసి జాబితాలో చేర్చాలి

**కెపిహెచ్బి కాలనీ, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :** గొందళి సమాజ్ కుల సంఘాలను బిసి జాబితాలో చేర్చాలని కోరుతూ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏక్‌నాథ్ దున్గే బుధవారం బిసి కమిషన్ చైర్మన్ గోపిశెట్టికి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఏక్‌నాథ్ మాట్లాడుతూ కమిషన్ చైర్మన్ తమ సమస్యను సానుకూలంగా విని సానుకూలంగా స్పందించారని చెప్పారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు గొందళి సమాజ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## దేశ భవిష్యత్‌లో ఉపాధ్యాయుల పాత్ర కీలం

**బేగంపేట సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** దేశ భవిష్యత్‌ను రూపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం అని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డా.కోట నీలిమ, సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విశాల్‌సుధాం అన్నారు. బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు యాదగిరితో పాటు పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు.

**పాటిగడ్డలో కొత్త కార్డుల పంపిణీ**

బేగంపేట డివిజన్ పరిధిలోని ఓల్డ్‌పాటిగడ్డలో కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను కోట నీలిమ. విశాల్ సుధాంలు లబ్ధిదారులకు పంపిణీ చేసారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వం చిత్త శుద్ధితో ముందుకెళుతుందన్నారు.

## నూతన బిజెపి కార్యదర్శులకు ఘన సత్కారం

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర కార్యర్గంలో నియమితులైన నేతలను అంబర్‌పేట్ డివిజన్ పార్టీ అధ్యక్షులు పి.నాగరాజుచారి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. డిడి కాలనీలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు, రాష్ట్ర కార్యదర్శి ఓ.శ్రీనివాస్‌రెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి ఎడెల్లి అజయ్‌కుమార్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక బిజెపి నేతలు పాల్గొన్నారు.

## రైతుల కోసం చిత్తశుద్ధితో పనిచేయాలి

**ముషీరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** గత మూడు నెలలుగా యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా సూచించారు. బుధవారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రైతాంగం యూరియా కోసం ఇబ్బందులు పడటానికి కారణం తెలంగాణ ప్రభుత్వం సరైన సమయంలో సరైన రీతిగా స్పందించక పోవటమేనని ఆరోపించారు.

## 20న దశావతారం నృత్య నివేదన

**రవీంద్రభారతి, సెప్టెంబరు 10 ప్రభాతవార్త :** ప్రజాపతి కల్చరల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో దశావతారం నృత్య నివేదికకు ఔత్సాహిక కళాకారులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ ఛైర్మన్ ఫణింద్ర కుమార్ తెలిపారు. కెపిహెచ్‌బి వారాహిస్వామి ఆలయంలో ఈ నెల 20న ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కూచిపూడి, భరతనాట్యం, కథక్, ఒడిస్సీ, పేరిణి తదితర నాట్యాంశాలను ప్రదర్శించటానికి ఆసక్తిగల కళాకారులు 9440480543లో 15వ తేదీలోగా తమపేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులకు సర్టిఫికెట్, జ్ఞాపిక అందజేయనున్నట్లు ఫణింద్ర పేర్కొన్నారు.

## యువతిని వేధిస్తున్న వ్యాపారిపై కేసు

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** నిశ్చితార్థం చేసుకున్న వెనువెంటనే యువతిని వేధిస్తున్న ఒక వ్యాపారిపై ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఫిలింనగర్ ప్రాంతంలో నివసించే ఒక యువతికి ఎగుమతులు, దిగుమతుల వ్యాపారం నిర్వహించే ఆదర్శ్ వేముల(33) అనే యువకుడి వివాహ నిశ్చితార్థం అయింది. ఆమెతో అసభ్యంగా మాట్లాడటం ప్రారంభించాడు. అదర్శ్ ఇతర యువతులతో కలవిసి ఉన్న ఫోటోలను గమనించిన బాధితురాలు అతన్ని ప్రశ్నించడంతో ఆమెపై దాడిచేశాడు. దీంతో నిశ్చితార్థాన్ని రద్దు చేసుకున్నారు. అర్ధరాత్రి సమయంలో ఆమెకు ఫోన్ చేసి వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఫిల్మ్‌నగర్ పోలీసులు ఆదర్శ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అక్రమ రవాణాలో పాల్గొన్న 20 మంది బంగ్లాదేశ్ పౌరులను ఇండో బంగ్లాదేశ్ సరిహద్దు ద్వారా డిపోర్ట్ చేసినట్లు సీపీ వెల్లడించారు.

## క్రికెట్ బ్యాట్ కోసమే హత్య చేశా

### సహస్ర కేసు నిందితుడు పునరుద్ఘాటన

**హైదరాబాద్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** కూకట్‌పల్లిలో జరిగిన సహస్ర హత్యకేసులో నిందితుడిగా ఉన్న మైనర్ బాలుడిని పోలీసు కస్టడీకి కోర్టు అనుమతించింది. దీంతో పోలీసులు జువైనల్ హోమ్‌లోనే నిందితుడికి సైకియాట్రిక్ ట్రీట్మెంట్ అనంతరం అతడిని విచారించినట్లు తెలుస్తోంది. అయితే గతంతో పోల్చితే బాలుడిలో మార్పు ఉందని పోలీసులు తెలిపారు. తాను క్రికెట్ బ్యాట్ కోసమే సహస్రను హత్య చేశానని మరోసారి పోలీసు కస్టడీ విచారణలో చెప్పినట్లు సమాచారం.

## గాయని అనురాధకు అవార్డ్ ప్రదానం

**హైదరాబాద్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో వంశీ ఇంటర్నేషనల్ నిర్వహణలో విఖ్యాత నటి భానుమతి జయంతి సందర్భంగా ప్రముఖ గాయని పాల్వంచ అనురాధకు వంశీ భానుమతి గ్లోబల్ మ్యూజిక్ అవార్డ్ ప్రదానం చేశారు. వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో సంఖ్య శాస్త్ర వేత్త దైవజ్ఞ శర్మ పాల్గొనగా తొలుత వై ఎస్ రామ కృష్ణ నూకల ప్రభాకర్ రేవతి శ్రీదేవి తదితరులు భానుమతి సినిమా లలో సహా గాయకులతో కలసి పాడిన పాటలు మధురంగా ఆలపించారు సుధామయి వ్యాఖ్యానం చేశారు.

# భారతీయ సాహిత్య ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటారు

**చార్మినార్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త :** భారతీయ సాహిత్య ఔన్నత్యాన్ని జ్ఞాన పీఠ పురస్కార గ్రహీతులు ప్రపంచానికి చాటి చెప్పారని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. విశ్వనాథ సాహిత్య పీఠం, ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖ సంయుక్తంగా నిర్వహించిన జ్ఞాన పీఠ పురస్కార గ్రహీతల సాహిత్య సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విశ్వనాథ సత్యనారాయణ, డా.సి. నారాయణరెడ్డి, రావూరి భరత్వాజల సాహిత్య కృషిని గురించి ప్రత్యేకంగా సదస్సును నిర్వహిం చటం అరుదైన విషయమని అభినంధించారు. తెలుగులో విశ్వనాథ సత్యనారాయణ ఒక సాహిత్య శిఖరమని, విభిన్న భాషలలో ఆయనకు పాండిత్యముందని, తెలుగు గేయ వికాసానికి డా.సి.నారాయణరెడ్డి ఎంతో కృషి చేశారని, స్వయం శక్తితో గొప్ప సాహితీ వేత్తగా ఎదిగారని ఆయన తెలియజేశారు. సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్, డా.వెల్చాల కొండల రావు, ఆత్మీయ అతిథి విశ్వనాధ మనవడు కళాపూర్ణ శోభనాద్రి, సదస్సు కన్వీనర్ అవధానం సుజాత, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటి తెలుగు ఆచార్యులు దార్ల వేంకటేశ్వరరావు, అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు ఎన్.రజనీ, సిటీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.శాంతి, తెలుగు శాఖ అధ్యక్షులు డా.కోయి కోటీశ్వరరావు, తెలుగు శాఖ సహాయ ఆచార్యులు అవధానం సుజాత, డా.పి.కమల సుధారాణి, ఆచార్య కాకునూరు సూర్యనారాయణ మూర్తి, అధ్యాపకులు డా.సుజాత అజ్మీరా, డాక్టర్.జె.నీరజ పాల్గొన్నారు.



సాహితీ సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

## త్వరగా పెండింగ్ పనులను పూర్తి చేయాలి : ఎమ్మెల్యే అహ్మద్ బలాల


అధికారులు, కార్పొరేటర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బలాల

**మలక్ పేట ,సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మలక్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు, కార్పొరేటర్ లతో అభివృద్ధి పనుల గురించి ఎమ్మెల్యే బాలల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ నియోజకవర్గంలో నూతన అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రతిపాదనలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మినాజుద్దీన్, సలాం షాహిద్, నాయకులు అబ్రార్, సైపుద్దన్ షఫీ, అధికారులు కవిత, ప్రజ్ఞ రెడ్డి, వెంకన్న, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలలో వీధులను శుభ్రంగా ఉంచాలి : కార్పొరేటర్


పారిశుద్ధ్య కార్మికులకు చెత్త సేకరణ రిక్షాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

**వనస్థలిపురం. సెప్టెంబర్.10.ప్రభాతవార్త.**
బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్ నగర్ శ్రీ సీతారామాంజనేయ స్వామి కళ్యాణ మండపంలో బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పారిశుద్ధ్య సిబ్బందికి చెత్త సేకరణ రిక్షాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని చిన్న చిన్న దారుల్లో చెత్త సేకరణను సులభతరం చేయడానికి మరియు పారిశుద్ధ్య కార్మికులకు చెత్త సేకరణలో సహాయపడటంతో పాటు, పరిశుభ్రతను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ రిక్షాలు పంపిణీ చేయడం జరిగిందని ప్రజల ఆరోగ్యం,కాలనీల పరిశుభ్రత కోసం రోజూ కష్టపడుతున్న సిబ్బందికి ఇలాంటి సౌకర్యాలు అందించడం ద్వారా వారి పనితీరు మరింత మెరుగుపడుతుందని మరియు కాలనీలో ఎప్పటికప్పుడు చెత్తకుప్పలు తొలగించాలని, కాలనీవాసులు ఇబ్బందులు పడకుండా ప్రతిరోజు కాలనీలోని రోడ్లు శుభ్రపరచుకోవాలని పారిశుద్ధ్య కార్మికులకు పలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో శానిటేషన్ డిఈ నీలిమ,ఎస్ఎస్ అజీమ్ ఉద్దీన్ జవాన్ యాదయ్య, మరియు పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్షులు మహేష్ గౌడ్ మరియు పారిశుద్ధ్య ఎస్ఎఫ్‌లు, తదితరులు ఉన్నారు.

## జలమండలి అధికారులతో కార్పొరేటర్ సమీక్ష


జలమండలి అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త :** జలమండలి అధికారులతో సమస్యలపై కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఇప్పటికే సుమారు రెండు కోట్ల రూపాయల డ్రైనేజీ నిర్మాణ పనులకు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి నిధులు మంజూరు చేయించడం జరిగిందని కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పేర్కొన్నారు. మంజూరైన పనులను ఇదివరకే ప్రారంభించడం జరిగిందని, తొందరలోనే పనులు పూర్తి అయ్యేలా చూడాలని జలమండలి మేనేజర్ సిరాజుద్దీన్ కు కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ సూచించారు.అలాగే కొత్తగా ఎనిమిది ప్రాంతాలలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి అలాగే శ్రీ రాఘవేంద్ర నగర్ లోని వీధి నెంబర్ 3, 5, 7లలో కొత్త మంచినీటి పైప్లైన్ కొరకు ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బారాస నాయకులు సాయి జన్ శేకర్, భూపాల్ రెడ్డి, సివరేజ్ సూపర్వైజర్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు .

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

**తార్నాక, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త :**
బిజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావును మాజీ మేయర్ బండ కార్తిక చంద్రారెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా తనకు బాధ్యతలు అప్పగించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసినట్లు చెప్పారు.పార్టీని బలోపేతం చేయడానికి, ప్రజలకు సేవ చేయడానికి అవిశ్రాంతంగా పనిచేయడానికి నేను కట్టుబడి ఉన్నానని వారు అధ్యక్షులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బండ చంద్రా రెడ్డి, వేణు యాదవ్, వెంకటేష్ గౌడ్, యూ. మల్లేష్, గణేష్, వీరన్న పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : కార్పొరేటర్


రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:**
సైదాబాద్ డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. ఆస్మాన్‌ఘడ్ క్యాపిటల్ హోటల్ వెనుక చేపడుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ డివిజన్‌లో మౌళిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని అన్నారు. బి బ్లాక్ క్వార్టర్స్‌లో పార్కులు నిర్వాణా లోపంతో ఉన్నాయని, పార్కుల్లోని చెత్తను వెంటనే తొలగించాలని హార్టికల్చర్ మేనేజర్ కిరణ్ కుమార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్, హార్టికల్చర్ సూపర్ వైజర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.


కాపుర సర్కిల్ పరిధిలోని ఈసీఐఎల్ చౌరస్తాలో చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న రామ్ ప్రదీప్ బృందం


తుర్కయంజాల్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సిపిఎం నాయకులు కార్యకర్తలు పార్టీ సభ్యులు, సానుభూతిపరులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పిస్తున్న దృశ్యం


హయత్ నగర్ లోని పార్టీ కార్యాలయంల ఐలమ్మకు నివాళ్లలర్పిస్తున్న కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి,నాయకులు.


ముసారాంబాగ్ కృష్ణ తులసి నగర్ కమ్యూనిటీ హాల్ లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి తదితరులు


ఆర్కేపురం డివిజన్ రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సబితాఇంద్రారెడ్డి, అరవింద్‌శర్మ, నగేష్


రామంతాపూర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ ఇంచార్జ్ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు


గౌతమ్ నగర్ డివిజన్‌లోని జ్యోతి నగర్ దోబీ ఘాట్లో చాకలి ఐలమ్మ విగ్రహానికి మల్కాజ్గిరి సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సిహెచ్ దశరథ్ టి యాదయ్య గౌడ్ కాసర్ల నాగరాజు యాదగిరి కళాకారులు వి వెంకట చారి నాయకులు నిమ్మల నరసింహా డి జంగయ్య జి రాములు బి లింగం తదితరులు పాల్గొన్నారు.


ఎల్ బి నగర్ చింతలకుంట చెక్ పోస్ట్ వద్ద వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మి ప్రసన్న రామ్మోహన్ గౌడ్.

# వీరనారి చాకలి ఐలమ్మ సేవలు మరువలేనివి

## డ్రగ్స్ దందాకు పాల్పడుతున్న దుర్మార్గులను కఠినంగా శిక్షించాలి : ఏఐవైఎఫ్




**కుషాయిగూడ,సెప్టెంబర్ 10, ప్రభాతవార్త**
వేల కోట్ల రూపాయలు చేసి విలువచేసే డ్రగ్స్ తయారీ అక్రమ తయారీదారులపై ఘటనస్ చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేసింది. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో డ్రగ్స్ ను నిర్మూలించాలని భారీ అవగాహన ర్యాల, డ్రగ్స్ తయారు చేస్తున్న, సరఫరా చేస్తున్న దుర్మార్గులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా స్టాప్ డ్రగ్స్ స్టాప్ స్పోర్ట్స్ పేరిట సెప్టెంబర్ మాసం అంతటా రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు, ఇందులో భాగం గానే ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తా నుండి జీహెచ్ ఎంసీ కార్యాలయం వరకు డ్రగ్స్ అంతం మనందరి బాధ్యత అంటూ ప్లకార్డులు చేతబూని భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం డ్రగ్స్ ను నిర్మూలించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ కార్యదర్శి ధర్మేంద్ర, జిల్లా అధ్యక్ష, కార్యదర్శి సల్మాన్ బేగ్, సత్య ప్రసాద్ లు మాట్లాడుతూ ఇటీవల చర్లపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో కోట్లు విలువ చేసే డ్రగ్స్, సంబంధిత కెమికల్స్ పట్టుబడటం సిగ్గు చేటు అని ఇది పూర్తిగా మన రాష్ట్ర నిఘా వ్యవస్థ వైఫల్యంగా బావించాలన్నారు. దేశానికే ఆదర్శప్రాయుడైన భగత్ సింగ్ స్ఫూర్తితో నేటి యువత చెడు మార్గాలను,చెడు అలవాట్లను విడనాడాలని వారు పిలుపునిచ్చారు.చర్లపల్లిలోని వాగ్దేవి ల్యాబ్ యాజమాన్యాన్ని ప్రధాన నిందితుడు శ్రీనివాస్, విజయ్ ఓలేటి, తానాజి పట్వారీ తదితరులను కఠినంగా శిక్షించాలని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రగ్స్ ను అరికట్టడంలో చొరవ చూపిస్తున్నా ఆయా శాఖల అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అటువంటి అధికారులను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు గిరిబాబు, మోసిన్, శేఖర్ కార్యవర్గ సభ్యులు సమీర్, చేతన్, శివ, నరేష్,కీర్తన, రమ్య, రవళి, సుజాత,హస్మిత బేగం, నేతలు మహేష్, అజీమ్ పాషా, ఇంతియాజ్ లతో పాటు సుమారు 400మంది యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి మినీ ఛాంపియన్ షిప్ పోటీలు : ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

**మలక్ పేట ,సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:**
రంగారెడ్డి జిల్లా బ్యాట్మెంటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి మినీ బ్యాట్మెంటన్ చాంపియన్ షిప్ పోటీలను నిర్వహించనున్నట్లు రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కరేడ్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (బిఏటి), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ ల సంయుక్త పర్యవేక్షణలో అండర్ 11 విభాగంలో సన్ రైజ్ యోనెక్స్ తెలంగాణ రాష్ట్ర 4వ మినీ బ్యాట్మెంటన్ చాంపియన్ షిప్ 2025 పోటీలను ఈనెల 18వ తేదీ నుంచి 21 తేదీ వరకు నాగోల్ లోని విక్రాంత్ బ్యాట్మెంటన్ అకాడమీ ఎలైట్ గేమర్స్ గ్యారేజీలో నిర్వహించనునట్లు ఆయన తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు 2015 తర్వాత జన్మించిన వారై ఉండాలని, ఎంట్రీలకు చివరి తేదీ ఈ నెల 15వ తేదీ అని, అంత లోపుగా వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, పోటీలలో పాల్గొనే వారి పూర్తి పేరుతో సహా జిల్లా పేరు కూడా నమోదు చేయాలని ఆయన సూచించారు. ఆన్లైన్ రిజిస్ట్రేషన్ కోసం వెబ్ సైట్ లింక్ లో లాగిన్ అవ్వాలని కోరారు. అండర్ 11 విభాగంలో బాల బాలికలకు సింగిల్స్, డబుల్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సింగిల్స్ పోటీలలో పాల్గొని క్రీడాకారులు ఎంట్రీ ఫీజు కింద రూ .800, డబుల్స్ విభాగంలో పాల్గొనే క్రీడాకారులు రూ.1000 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి విభాగంలో గెలుపొందిన విజేత, రన్నర్, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి మెరిట్ సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుందని ఆయన వివరించారు.
గుజరాత్ రాష్ట్రం వడోదరలో జరిగే అండర్ 11 మినీ జాతీయ పోటీలలో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించడానికి ఈ చాంపియన్ షిప్ పోటీల నుంచే క్రీడాకారుడుని ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. మరిన్ని వివరాల కోసం 98480154 43, 7788993006 నెంబర్లలో సం ప్రదించాలని ఆయన కోరారు.

## సాగర్ కాంప్లెక్స్ కల్వర్టు వద్ద త్వరగా పనులు చేపట్టాలి : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.


జలమండలి ఎండికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.

**వనస్థలిపురం. సెప్టెంబర్.10.ప్రభాతవార్త**
ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మెట్రో వాటర్ వర్క్స్ ఎం.డి.అశోక్ రెడ్డి ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు.దానిలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని బి.ఎన్.రెడ్డి నగర్,మన్సూరాబాద్,హయత్ నగర్ డివిజన్ల ప్రధానంగా ఎదుర్కొంటున్న ట్రంక్ లైన్స్ సమస్యల గురించి పలు కాలనీ సంక్షేమ సంఘ సభ్యులచే పలు సమస్యలను ప్రస్తావించారు.ముఖ్యంగా సాగర్ కాంప్లెక్స్ మీద నుంచి వచ్చే డ్రైన్స్ నీరు గుర్రంగుడా ఫారెస్ట్ మరియు హరిహరపురం కాలనీలోకి రావడం జరుగుతున్న నేపథ్యంలో ఫారెస్ట్ నందు రెండు చెరువుల కూపంగా కావడం జరిగిన నేపథ్యంలో ఫారెస్ట్ మురికినీరు చేరి తీవ్ర దోమలు రావడం జరుగుతుంది అని అన్నారు.అట్టి ఫారెస్ట్ మురికికూపంగా మారుతుండడంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వారు ఫారెస్టు నాశనం చేస్తున్నారని ఆ పనులు ఆపడం జరిగింది అని అన్నారు.కావున యుద్ధప్రాతిపదికన సాగర్ కాంప్లెక్స్ కల్వర్టు నుంచి అలాగే హరిహరపురం కాలనీ దగ్గర ఉన్న డ్రైనేజీ ఛాంబర్ వద్ద కలపడానికి షార్ట్ టెండర్ ఏర్పాటు చేసి తక్షణమే నిధులు మంజూరు చేయాలని కోరారు.వారు వెంటనే స్పందించి దాదాపు 17 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు.అందుకు కాలనీ అసోసియేషన్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.అలాగే మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని స్వాతి రెసిడెన్సీ వద్ద దాదాపు మూడు నెలల క్రితం ఆగిపోయిన ట్రంక్ లైన్స్ పనులు వెంటనే ప్రారంభం చేయాలని కోరారు.వెంటనే స్పందించిన కమిషనర్ గారు రెండు,మూడు రోజుల్లో అట్టి కాంట్రాక్టర్ పనులు ప్రారంభం చేయకపోతే బ్లాక్ లిస్టులో పెట్టి షార్ట్ టెండర్ వేయించి 15 రోజుల్లో పనులు ప్రారంభం చేయాలని అధికారులను ఆదేశించారు.అలాగే హయత్ నగర్ డివిజన్ పరిధిలోని లక్ష్మీప్రియ కాలనీ,దుర్గ నగర్,వెంకటేశ్వరకాలనీ,పీ టీ.కాలనీ,రాజేశ్వరి కాలనీ,మైత్రి విల్లాస్ తదితర కాలనీలకు ట్రంక్ లైన్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు.అలాగే నియోజకవర్గ పరిధిలోని కొన్ని కాలనీలు మరియు శివారు ప్రాంతాల్లో ఇండ్లు పెరిగి మంచినీరు సరిపోవడం లేదని కావున మంచినీరు తక్కువగా వస్తున్న ప్రాంతాల్లో మంచినీటి సదుపాయాలు కల్పించాలని కోరారు.దీనిపై మెట్రో వాటర్ వర్క్స్ ఎం.డి.అశోక్ రెడ్డి గారు సానుకూలంగా స్పందించి,అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.పనులను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి గారు ఎం.డి. గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి,మన్సూరాబాద్ డివిజన్ యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి,బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ భారస పార్టీ ఉపాదక్షులు మరియు హరిహరపురం కాలనీ జనరల్ సెక్రటరీ సండడి సందీప్ రెడ్డి,సాగర్ కాంప్లెక్స్ ఫేస్.1 అధ్యక్షులు కృష్ణరెడ్డి,సాగర్ కాంప్లెక్స్ ఫేస్.2 అధ్యక్షులు మహేందర్ రెడ్డి,సిరిపురం కాలనీ అధ్యక్షులు ముత్యంరావు,వినూత్న కాలనీ అధ్యక్షుడు నరేన్ రెడ్డి,గాంధీ నగర్ సౌత్ అధ్యక్షులు కృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులు, జిహెచ్ఎంసి అధికారులకు సన్మానం



పోలీసు అధికారులను సన్మానిస్తున్న కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:**
వినాయక నవరాత్రి ఉత్సవాలను, నిమజ్జనాన్ని విజయవంతంగా పూర్తి చేసినందుకు లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి బుధవారం ఎల్‌బి నగర్ జోనల్ కమీషనర్ హేమంత్ కేశవ పాటిల్, సరూర్ నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, ఎస్ఐలు మారయ్య, మహేందర్, గంగాధర్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సరూర్‌నగర్ మిని ట్యాంక్‌బండ్‌లో దాదాపు 6 వేల వినాయక విగ్రహాలు నిమజ్జనం చేయడం జరిగిందన్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా జిహెచ్ఎంసి అధికారులు, పోలీసులు నిద్రాహారాలు మాని పనిచేయడం జరిగిందని, వారందరిని కార్పొరేటర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మనోజ్, ప్రవీణ్‌రెడ్డి, గణేష్ రెడ్డి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం: నవారు మల్లారెడ్డి


అల్మాస్‌గూడ జయశంకర్ కాలనీ, వైఎస్ఆర్‌నగర్‌లలో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డి

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో లబ్ధిదారులైన పేదల కళ్లల్లో ఆనందం కనిపిస్తున్నదని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, అల్మాస్‌గూడ 24వ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ నవారు మల్లారెడ్డి వెల్లడించారు. బుధవారం ఆయన అల్మాస్‌గూడ పరిధిలోని 24వ డివిజన్ కిందకు వచ్చే జయశంకర్ కాలనీ, వైఎస్ఆర్ నగర్ వీకర్ సెక్షన్ కాలనీల్లో పర్యటించి నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ళ పథకం కింద ఎంపికై గృహ నిర్మాణాలు చేసుకుంటున్న స్థానిక లబ్ధిదారులను పలకరించిన ఆయన వారితో కలిసి నిర్మాణాల స్థితిగతులను పర్యవేక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో లబ్ధిదారులు ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేస్తుండడం పట్ల మల్లారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఇందిరమ్మ ఇళ్ళ పథకం గురించి అదే విధంగా ప్రభుత్వ సహాయ సహకారాలు, బిల్లుల సకాలంలో మంజూరు అవుతున్నాయా? అనే విషయాలపై ఆయన ఆరా తీశారు. ఇళ్ళ నిర్మాణం చేస్తున్న లబ్ధిదారులందరూ తమకు ఎలాంటి ఇబ్బందులు లేవనీ కాంగ్రెస్ పాలనలో తమ సొంతింటి కల సాకారం అవుతున్నందుకు సంతోషంగా ఉందని వెల్లడించారు. తమకు అండగా ఉండడానికి వీకర్ సెక్షన్ కాలనీలకు వచ్చి ఇళ్ళ నిర్మాణాలపై వాకబు చేస్తున్నందుకు వారు మల్లారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అల్మాస్‌గూడ పరిధిలో అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందేలా చూడడమే తన లక్ష్యమని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తయ్యే వారు లబ్ధిదారులకు తాను అండగా ఉంటానని ఆయన భరోసానిచ్చారు. సకాలంలో ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారులు, వారి కుటుంబాల వారు పాల్గొన్నారు.

## ఇళ్లలో పనిచేసే వారి వివరాలు తప్పని సరిగా చూసుకోవాలి


గృహ సేవకుల వెరిఫికేషన్ చేస్తున్న ఎస్సై మైబెల్లి తదితరులు

**నాచారం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త :** నాచారం పరిధిలోని రహేజా విస్టాస్ లో నాచారం పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ రుద్వీర్ కుమార్, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎస్.కె. మైబెల్లీ పర్యవేక్షణలో బుధవారం గృహ సేవకుల వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాచారం పోలీస్ స్టేషన్ ఎస్సై వెంకటయ్య మాట్లాడుతూ ఇళ్లలో పనిచేసే పనివాళ్లు, వంటవాళ్లు, డ్రైవర్లు, కేర్ టేకర్ల వంటి సర్వీస్ ప్రొవైడర్ల యొక్క నేర చరిత్ర పోలీస్ వెరిఫికేషన్ తప్పనిసరి అని తెలిపారు. ఇలా చేయడం వలన పనివారికి సులభంగా ఉద్యోగం దొరుకుతుందన్నారు.అప్పుడే నేరాలను ముందే నివారించవచ్చని ఆయన చెప్పారు. ఈ ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు పోలీసులు కమ్యూనిటీలో ఈ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఈ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసేందుకు పోలీసులతో సమన్వయం చేసుకున్న రహేజా విస్టాస్ కు చెందిన డిఈఎఫ్ సొసైటీ ప్రెసిడెంట్ మనోజ్ శంకరమంచి, జాయింట్ సెక్రటరీ నిషాంత్,అడబాల శేషగిరి రావు, శివ కలువకోట, కిషోర్ తాతపూడి, అండ్ రమేష్ బాబు లు ఈ సందర్భంగా పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 100 మందికి పైగా ఇండ్లల్లో పనిచేసే మహిళలు పాల్గొనగా వారి బయోమెట్రిక్‌లను సేకరించి ధృవీకరించారు. నివాసితులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మహేశ్వరం నియోజకవర్గానికి నాలుగు సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు


జలమండలి అధికారులతో చర్చిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గానికి నాలుగు సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (మురుగు నీటి శుద్ధి ప్లాంట్లు) మంజూరైన నేపథ్యంలో బుధవారం మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి జలమండలి అధికారులు ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోనున్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి జనరల్ మేనేజర్ సుబ్రమణ్యం, చీఫ్ జనరల్ మేనేజర్ సుజాత, డిప్యూటీ జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని జిల్లెలగూడ చందన చెరువు, మీర్‌పేట్ పెద్ద చెరువు, రావిర్యాల, ఉందా సాగర్ చెరువుల వద్ద రూ.131.93 కోట్ల వ్యయంతో చేపట్టే సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల విషయమై చర్చించారు. ఈ మేరకు ప్లాంట్లను త్వరితగతిన నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ ప్లాంట్ల ద్వారా మురుగు నీరు శుద్ధి జరిగి వాటిని వినియోగించుకునే అవకాశం కలుగుతుందనీ దీని ద్వారా పర్యావరణ పరిరక్షణ, ప్రజలకు మేలు జరుగుతుందని ఆమె వెల్లడించారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి : కార్పొరేటర్


రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ సరస్వతినగర్‌లో నూతన సిసి రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నిర్ధేశిత నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జంగం మధుకర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, కాలనీవాసులు ప్రభాకర్‌రెడ్డి, చెన్నారెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, ఎం.ఎన్.రెడ్డి, శైలజ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## సూర్యచంద్రులు ఉన్నంత వరకు ఐలమ్మ పేరు చిరస్థాయిగా ఉంటుంది : పెండ్యాల నర్సింహ


జిల్లెలగూడ చందన చెరువు కట్టపై చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించిన మీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ పెండ్యాల నర్సింహ

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** తెలంగాణ సాయుధ పోరాటంలో వీర మాత చిట్యాల ఐలమ్మ అలియాస్ చాకలి ఐలమ్మ పేరు సూర్య చంద్రులు ఉన్నంత వరకు ఉంటుందని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్, బిజెపి మాజీ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ అన్నారు. బుధవారం జిల్లెలగూడ చందన చెరువు కట్టపై జరిగిన ఐలమ్మ వర్ధంతికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి నర్సింహ పుష్పాభిషేకం చేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనలో తొలి భూపోరాటం చేసిన నిప్పుకణిక ఐలమ్మ ఎప్పటికీ స్ఫూర్తిదాయకమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ కార్పొరేషన్ రజక సంఘం నాయకులు భీమరాజు బిక్షపతి, పుప్పాల రామకృష్ణ, భీమరాజు శంకర్, ఐతరాజు వెంకటేష్, బంగారు శ్రీధర్, కేతరాజు, ఐతరాజు వెంకటేష్, చంపాపేట్ డివిజన్ నాయకులు బాలకృష్ణ, మల్లేష్‌లతో పాటు సంతోష్, సాయిచరణ్, శివ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర కార్యదర్శి వీరేందర్‌గౌడ్‌కు ఘన సత్కారం

**ఉప్పల్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త :**
భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బిజెపి సీనియర్ నేత, తూళ్ళ వీరేందర్ గౌడ్‌ను చిలుకానగర్ డివిజన్‌కు చెందిన పలువురు బిజెపి నేతలు కలిసి సత్కరించారు. బిజెపి అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్, పార్టీ నేతలు సంఘిస్వామియాదవ్, అలే నరేందర్, తెలంగాణ సంపత్ తదితరులు నాంపల్లి లోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కలిసి అయన ను కలిసి శాలువాతో సత్కరించారు. తూళ్ల వీరేందర్‌గౌడ్ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు.